
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అల్పాదాయ వర్గాలకు సహకార సంఘాల్లో స్థానం : కలెక్టర్

భీమవరం రూరల్/టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వివిధ సహకార సంఘాల ఏర్పాటులో అల్పాదాయ వర్గాలకు స్థానం కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సహకార సంఘాల ప్రమోషన్, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. జిల్లాలో 369 గ్రామ పంచాయతీల్లో 122 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వీటిలో 42 బహుళ సేవలందిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలోకి రాని పంచాయతీల్లో కొత్త బహుళ ప్రయోజన పరపతి సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నాబార్డు, సహకారశాఖ, పశుసంవర్ధక, మత్స్యశాఖలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

జిల్లాభివృద్ధిలో నైపుణ్య గణన గణాంకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నైపుణ్య గణన-2024 జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో రాగల మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఉద్యోగాలు పొందడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్య గణనను సచివాలయ సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ద్వారా జిల్లాలోని స్కిల్ ల్యాండ్ స్కేప్ మెరుగు పరచడానికి విద్య-ఉపాధి అవకాశాల మధ్యగల అంతరాన్ని పూరించడానికి సమగ్ర స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తుందని తెలిపారు.

తీరని ఇసుకపాట్లు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నా ఇసుక కష్టాలు మాత్రం తీరడం లేదు. చిన్న చిన్న అవసరాలకు కావలసిన ఇసుక జిల్లాలో లభించడం లేదు. తూర్పు గోదావరి జిల్లాకు వెళితే తప్ప దొరకని పరిస్థితి. ఆన్‌లైన్ విధానం లేకపోవడం, జిల్లాలో ర్యాంపులు పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లా నుంచి తీసుకువచ్చే ఇసుక ఐదు యూనిట్ల లారీ రూ.22 వేలు చెల్లించాల్సి వస్తోంది. అదే పశ్చిమలోని ర్యాంపులు తెరిస్తే ఐదు యూనిట్ల ఇసుక రూ.16 వేలకు లభిస్తుంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

'రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక బాణసంచా వ్యాపారానికి పన్ను ఎందుకు చెల్లించాలి' అంటూ ఓ వ్యాపారి ఇచ్చిన సమాధానానికి అధికారులు షాక్ తిన్నారు. కారణాలు ఏమైతేనేం.. ఈసారి భీమవరం పట్టణంలోని బాణసంచా వ్యాపారులు పన్ను చెల్లించేందుకు నిరాకరిస్తున్నారు. దీనిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎందుకిలా..?



వ్యాపారుల చిటపటలు

- బాణసంచా అమ్ముతూ పన్ను చెల్లించేందుకు నిరాకరణ
- జిల్లా అంతటా ఒక లెక్క.. భీమవరంలో మరో లెక్క
- కలెక్టర్ చొరవ.. ఫలితం శూన్యం.. తలలు పట్టుకున్న అధికారులు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. జిల్లా అధికారులు దీనిపై ప్రకటన చేశారు. వ్యాపారులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. కాని, భీమవరం పట్టణంలో ఇవేమీ పనిచేయలేదు. వర్తకులు పన్ను చెల్లించేందుకు నిరాకరిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల నుంచి ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తర్వులు వచ్చాయి. భీమవరంలో పన్ను చెల్లించని విషయం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. జిల్లా కలెక్టర్ నాగరాణి దృష్టికి వెళ్లింది. దీనిపై ఆమె అందరి ఆర్డీవోలకు లిఖిత పూర్వకంగా దిశా నిర్దేశం చేశారు. పన్నులు చెల్లించి లైసెన్స్ తీసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. అయినా సరే బాణసంచా వ్యాపారుల నుంచి స్పందన లేదంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాణిజ్య పన్నుల శాఖలో రాష్ట్రస్థాయిలోనే దీనిపై దృష్టిపెట్టారు. జాయింట్ కమిషనర్ సైతం జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అయినా ఫలితం రాలేదు. భీమవరంలో ఏటా 40 మంది వర్తకులు రిటైల్ వ్యాపారం చేస్తుంటారు. ఒక్కో వ్యాపారి రూ.15 వేల వంతున పన్ను చెల్లిస్తే సరిపోతుంది. భీమవరం సర్కిల్ పరిధిలోనూ గ్రామాల్లో వర్తకులు సైతం పన్ను చెల్లించేశారు. భీమవ రంలో వ్యాపారుల నుంచి రూ.12 లక్షల మేర వసూలు కావాలని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే ముందుగా చెల్లింపులు జరిపితే అందులో సగంతోనే సరిపోయేది. కానీ కొందరు వ్యాపారులు ధిక్కార స్వరం వినిపి స్తున్నారు. లైసెన్స్ కోసం పన్ను ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. భీమవరం ఒక్కటే బాణసంచా వ్యాపారంలో పన్ను చెల్లించనట్టు ముద్రపడింది.

రెండు రోజులే వ్యాపారం

రిటైల్ వ్యాపారులకు రెండు రోజులపాటే అవకాశం కల్పిస్తారు. కొన్ని పట్టణాల్లో ఒక్క రోజుకు మాత్రమే వ్యాపారాన్ని పరిమితం చేస్తారు. హోల్‌సేల్ వర్తకులు నెల రోజుల ముందు నుంచే దుకాణాలు తెరచుకుంటారు. పన్నులు చెల్లించేస్తుంటారు. ఇప్పటి వరకు పన్ను చెల్లింపు విషయమై సమస్య రాలేదు. తాడేపల్లిగూడెం, తణుకు నియోజక వర్గాల్లో హోల్‌సేల్ వర్తకం ఉంటుంది. పన్ను చెల్లింపు ఏనాడూ వివాదం కాలేదు. ఈ ఏడాది హోల్‌సేల్ వర్తకులతోపాటు, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ పన్నులు చెల్లించేశారు. ఒక్క భీమవరంలోనే అధికారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులు వ్యాపారం సవ్యంగా చేసుకోవాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. ఏటా వాణిజ్య పన్నుల శాఖకు పన్ను చెల్లించేసేవారు.

రెవిన్యూ పక్కా

బాణసంచా వ్యాపారం నుంచి ప్రభుత్వానికి రెవిన్యూ తప్పనిసరిగా రావాలని వాణిజ్య పన్నుల శాఖ ఆకాంక్షిస్తోంది. దీనిపై ఆ శాఖ చీఫ్ కమిషనర్ కలెక్టర్‌లకు సూచనలు చేస్తారు. లైసెన్స్ ఇచ్చే ముందు జీఎస్టీ చెల్లించారో లేదో చూడాలని చెబుతారు. అయితే రెవెన్యూ అధికారులు పోలీస్, అగ్నిమాపక శాఖల క్లియరెన్స్ ఉంటే లైసెన్స్‌లు ఇచ్చేస్తు న్నారు. వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ రశీదు లతో సంబంధం ఉండడం లేదు. ఈ సారి కలెక్టర్ లిఖిత పూర్వకంగా ఆర్డీవోలకు ఆదేశాలు జారీచేశారు. దీంతో అన్ని ప్రాంతాల్లోనూ పన్ను చెల్లించారు. ఒక్క భీమవరం లోనూ పన్ను చెల్లింపులో తాత్సారం చేస్తున్నారు. దీంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పన్ను వసూలు చేయడానికి మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు.. తగ్గేదేలే



మునునూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా మునునూరు మండలంలో ఇసుకపై అంక్షలు ఎత్తివేయడంతో బలివే, యల్లాపురం, వలసపల్లి రీచ్ ట్రాక్టర్ల ప్రవాహంతో నిండిపోయింది. చెవులు బద్దల య్యే రణగొణ ధ్వనులతో టేప్ రికార్డర్లను పెట్టుకుని మీతిమీరిన వేగంతో రోడ్లపై వెళ్లడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సీఎం ఆదేశాల మేరకు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు ఆపవద్దని చెప్ప డంతో వారేం చేయలేని పరిస్థితి. సోమవారం రాత్రి కాట్రేనిపాడు వద్ద ఒక ట్రాక్టర్ వాగులో తిరగబ డింది. డ్రైవర్ స్టీరింగ్ కింద ఇరుక్కుపోవడంతో స్థానికులు కాపాడారు. అయినా ట్రాక్టర్ల వేగం మాత్రం తగ్గలేదు.

కాల్వ ఇలా.. నీరు పారేదెలా ?



ఆచంట, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం బ్యాంక్ కెనాల్ పచ్చగడ్డి, చెత్త, మొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయింది. దీని కారణంగా నీటి ప్రవాహం తగ్గింది. శివారు ప్రాంతాలైన యలమంచిలి మండలంలోని పలు గ్రామాలకు నీరు అంతంత మాత్రంగానే అందుతోంది. కొంత కాలంగా బ్యాంక్ కెనాల్ పిచ్చి మొక్కలతో కప్పేసి ఉంది. దీంతో బ్యాంక్ కెనాల్ ప్రస్తుతం పిల్ల కాలువ వలే దర్శనమిస్తుంది. రైతాంగానికి కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన బ్యాంక్ కెనాల్ ఇదే. పరిస్థితి ఇలా ఉన్నా కనీసం ఇరిగేషన్ అధికారులు చూసిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. ఇలా వదిలి వేస్తే బ్యాంక్ కెనాల్ సైతం పూడుకుపోయే ప్రమాదం ఉంది. ఇది పటిష్టం కావాలంటే బ్యాంక్ కెనాల్ మొత్తం రివిట్‌మెంట్ కడితే బాగుంటుంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సంబంధిత అధికారులు స్పందించి బ్యాంక్ కెనాల్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఫ్రీ బుకింగ్..!

- తొలి రోజు భారీగా స్పందన
- సొమ్ము చెల్లించి తీసుకుంటే.. రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ
- ఆధార్‌తో బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ లింకు అయితేనే లబ్ధి

భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం దీపావళికి ఉచిత గ్యాస్ అందించనుంది. దీపం, ఉజ్వల, సీఎస్ఆర్ గ్యాస్ కనెక్షన్లతో పాటు అర్హత ఉన్న ప్రతి తెల్లకార్డుదారులకు ఉచిత గ్యాస్ అందించే విధంగా మార్గదర్శకాలు విడుదల చేయడంతో పాటు మంగళవారం గ్యాస్ బుకింగ్ ప్రారంభించారు. దీపావళి పండుగ నాడు ఉచిత గ్యాస్ లబ్ధిదారులకు అందనుంది. ప్రస్తుతం ఉన్న గ్యాస్ సిలిండర్ ధర చెల్లించిన వెంటనే సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఉచిత గ్యాస్ కోసం మంగళవారం నుంచి బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో మొదటి రోజు జిల్లాలో అధిక సంఖ్యలో బుకింగ్స్ నమోదయ్యాయి. నమోదైన బుకింగ్స్ వివరాలు అధికార యంత్రాంగం సేకరించనుంది. దీపావళి పండుగ రోజున ఉచిత గ్యాస్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిస్తారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.2,520 ఆదా అవుతుంది.

రేపు ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ

జిల్లాలో అర్హులు 5 లక్షల 67 వేలు

ఉచిత గ్యాస్ పథకంలో జిల్లాలోని తెలుపు రంగు రేషన్ కార్డుదారులు ఐదు లక్షల 67 వేల మంది అర్హులు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులతో మంగళవారం రాత్రి సమీక్షించారు. దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 31 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 మధ్య కాలంలో ఒక సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు మొదటి సిలిండర్, ఆగస్టు ఒకటి నుంచి నవంబరు 31 మధ్య ఒక సిలిండర్, డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 31 మధ్యలో మూడో సిలిండర్ ఇవ్వనున్నారు. లబ్ధిదారులు గమనించి సిలిండర్లను బుక్ చేసుకోవాలని కోరారు. ఎల్‌పీజీ గ్యాస్‌కు తెలుపు రంగు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ కనెక్షన్ వివరాలతో అనుసంధానమై ఉండాలన్నారు.



మార్గదర్శకాలు

- ఉచిత గ్యాస్ పొందడానికి అర్హతలపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రధానంగా ఆధార్‌కార్డు, బియ్యం కార్డు కలిగి ఉండాలి. ఆధార్ నెంబర్‌తో లింక్ చేయబడిన బ్యాంకు ఖాతా నెంబరు, గ్యాస్ కనెక్షను కలిగి ఉండాలి. ఈ వివరాలు ఉన్న అర్హుల జాబితా సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద సిద్ధంగా ఉంది. వారు గ్యాస్ బుకింగ్ చేసుకుని సిలిండర్ పొందిన తర్వాత యథాప్రకారం ఏజెన్సీకి సొమ్ము చెల్లించాలి. ఉచిత గ్యాస్ పొందడానికి అర్హులైతే మొబైల్ నెంబరుకు మెసేజ్ వస్తుంది. మెసేజ్ వచ్చిన లబ్దిదారు ఖాతాలో గ్యాస్ సిలిండర్‌కు చెల్లించిన మొత్తం రెండు రోజుల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. తర్వాతి ఐదు నెలల్లో ఏ రోజు అయినా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు.


కోర్టుకు హాజరయ్యేందుకు విచ్చేసిన టీడీపీ నాయకులు

టీడీపీ నాయకులకు ఊరట

- కోర్టులో ఎన్నికల కేసు కొట్టివేత

నరసాపురం, మొగల్తూరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులకు మంగళవారం నరసాపురం కోర్టులో ఊరట లభించింది. మొగల్తూరు మండలం కాళీపట్నంలో 2014లో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అనుమతి లేకుండా సభలు నిర్వహించారనే అభియోగంపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, పొత్తూరి రామరాజు, జోగి వీరవెంకటరాధాకృష్ణ, రాయుడు శ్రీరాములు, జక్కంశెట్టి వెంకటేశ్వరరావులపై సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు.

వీరిలో జక్కంశెట్టి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో మిగిలిన ఆరుగురు మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. వాదోపవాదాలు విన్న జిల్లా అద నపు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కేసును కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో టీడీపీ నాయకులకు ఊరట లభించింది.

విద్యార్థికో నెంబరు

- అపార్ నమోదులో అపార కష్టాలు.. టీచర్ల పాట్లు



ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

- జిల్లాలో ఓటర్లు 4,71,189
- డిసెంబరు 24లోపు అభ్యంతరాల పరిష్కారం
- వచ్చే నెల నుంచి కొత్త ఓటర్ల నమోదు.. జనవరి 6న తుది ప్రచురణ

8

ఆవు దూడకు కృత్రిమ కాలు



పాలకొల్లు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):ఒక కాలు లేకపోతే ఎంత కష్టమో దివ్యాంగులను అడిగితే చెబుతారు. ఇక మూగ జీవాలైతే వాటి కష్టం చెప్పలేం. అలాంటి కష్టమే ఓ ఆవు దూడకు ఎదురైతే.. దాని యజమాని కృత్రిమ కాలు పెట్టించారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలెంకు చెందిన గోపాలమిత్ర మత్తి శ్రీనివాసరావుకు పశుపోషణ ఎంతో ఇష్టం. హనుమాన్ జంక్షన్‌లో గత ఏడాది ఒక ఆవును కొన్నారు. అది చూలు కావడం గత ఏప్రిల్‌లో దూడకు జన్మనిచ్చింది. అయితే దాని కుడి వైపు ముందు కాలు లేకుండా పుట్టడంతో నడిచేందుకు ఇబ్బంది పడుతోంది. దీని అవస్థలు చూసిన యజమాని కష్టం తీర్చాలని నిర్ణయించారు. మిత్రుల సలహా మేరకు పాలకొల్లులో మనుషులకు కృత్రిమ అవయవాలు అమర్చే వేదాంతం సదాశివమూర్తిని సంప్రదించారు. దూడకు ఉచితంగా కృత్రిమ కాలు తయారు చేసేందుకు అంగీకరించడంతో సోమవారం ఆవు దూడను పాలకొల్లు తీసుకువచ్చారు. పరీక్షించిన సదాశివమూర్తి దాదాపు 20 గంటలు శ్రమించి కృత్రిమ కాలు అమర్చారు. ప్రస్తుతం దూడ నడవడం కష్టంగా ఉన్నప్పటికీ అలవాటు పడుతుందని తెలిపారు. కృత్రిమ కాలు తయారీలో సదాశివమూర్తితోపాటు డాక్టర్ సి.మల్లిఖార్జునశర్మ, సిబ్బంది ప్రసాద్, చిన్న, అపర్ణ కృషి చేశారు. ఈ కాలుతో అది నడిస్తే దాని కష్టం తీరినట్లేనని యజమాని చెబుతున్నారు.



జీతాలు ఇవ్వడం లేదని సచివాలయం ముందు చెత్త వేసి పారిశుధ్య కార్మికుల నిరసన 9

వెబ్‌సైట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితా



స్ట్రీట్ ఫుడ్‌తో జర జాగ్రత్త

జనం చాలామంది ఇప్పుడు బయటితిళ్లకు అలవాటు పడిపోయారు.. అందుకే ఎక్కడ చూసినా బజ్జీల బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలుస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి పానీపూరి బండి దగ్గరకు పరుగు తీస్తున్నారు..అయితే ఇది ఎంత ప్రమాదకరమో తెలియడం లేదు. స్ట్రీట్ ఫుడ్స్ తినడం వల్ల ప్రాణాలకే ప్రమాదం అని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ మహిళ తనకిష్టమైన మోమోస్ తిని ప్రాణాలు పోగొట్టుకుంది. చాలా మంది అస్వస్థతకు గురయ్యారు..



ఒకప్పుడు ఇంట్లో వంట చేస్తే చుట్టుపక్కల నాలుగు ఇళ్లవరకూ ఆ వాసన వెళ్లేది. పండగలు వస్తున్నాయంటే చాలు ప్రతీ ఇంట్లోనూ పిండివంటల ఘుమఘుమలే.. దూరప్రాంతాల నుంచి ఏ సమయంలో చుట్టాలు వచ్చినా అప్పటికప్పుడు వండి పెట్టేవారు. కానీ ఇప్పుడే ఏం చేస్తున్నారు. బయటకు వెళ్లి ఏదో ఒకటి టక్కున కొని తీసుకొచ్చి పెట్టేస్తున్నారు. లేదంటే ఫుడ్ ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. గతంలో పట్టణాల్లో మాత్రమే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కనిపిస్తూ ఉండేవి. ఇప్పుడు పల్లెలకు కూడా పాకింది. పట్టణాలలో ఉద్యోగం, చదువురీత్యా ఉండే బ్యాచ్‌లర్స్ ఇంట్లో కూరలు వండుకోలేక కేవలం అన్నం మాత్రం వండుకుని కూరలు బయట నుంచి తెచ్చుకు తింటున్నారు. బయట వండే రుచులకు బాగా అలవాటు పడిపోయారు. ఫలితంగా అనవసరంగా రోగాలను కొని తెచ్చుకుని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఎక్కువగా ఫుడ్ తింటే 60 సంవత్సరాలకు వచ్చే దీర్ఘకాలిక రోగాలన్నీ 20 లేదా 30 ఏళ్లకే వచ్చేస్తాయని ఇది చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు పానీ పూరి అంటే పడిచస్తారని మసాలా నీటిలో ప్రమాదకర బ్యాక్టీరియాతో ఆరోగ్యానికి చేటు అని చెబుతున్నారు. -పెంటపాడు

బయటి ఆహారం ప్రమాదమే




ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తినే ఆహారం చాలా ప్రమాదకరం. ఎందుకంటే మన ఇంట్లో చేసినట్టుగా బయట చేయరు. వంటలకు నిల్వ నూనె వాడతారు. దీనివల్ల చాలా తొందరగా బీపీ, షుగర్, అల్సర్ లాంటి రోగాలు వచ్చేస్తాయి. బయట తినేస్థాయి పెరిగిందంటే ఇంతకంటే ప్రమాదకరమైన రోగాలు కూడా వస్తాయి. ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల హార్ట్ ఎటాక్‌లు కూడా వచ్చే అవకాశం ఉంది. బయట తినే ఫుడ్‌లో రుచి కోసం టేస్టింగ్ సాల్ట్ కలుపుతారు. దీనివల్ల కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పిల్లల్ని ఈ ఇటువంటి ఆహారానికి దూరంగా ఉంచాలి.

- డాక్టర్ తోట రాజేష్‌కుమార్ , పీహెచ్‌సీ వైద్యుడు, పెంటపాడు

ప్రతీ విద్యార్థికో నంబర్

ఒకే దేశం.. ఒకే చట్టం...ఒకే విద్యావిధానం.. స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వం దేశంలో విద్యార్థులందరికీ అధీకృత నమోదు సంఖ్యను కేటాయించడం కోసం అపార్ నమోదు పక్రియ ప్రారంభించింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆధార్ కార్డులో వివరాలతో యూడైస్ ప్లస్‌లో వివరాలు సరితూగిన తర్వాతే విద్యార్థులకు అపార్ ఐడీ నమోదు చేయబడుతుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి ఉపాధ్యాయులంతా ఇప్పుడు అపార్ ఐడీ వివరాల నమోదులో తలమునకలై ఉన్నారు ..

-నిడమర్రు /భీమవరం ఎడ్యుకేషన్





స్కూల్ విద్యార్థులకు అపార్ కార్డులు

విద్యార్థి విద్యా వివరాలన్నీ నిక్షిప్తం

వివరాల నమోదులో పాఠశాలల ఉపాధ్యాయులు తలమునకలు

ఇబ్బందులను అధిగమించేందుకు విద్యాశాఖ చర్యలు

అపార్ ఐడీ ఎందుకు ?

అపార్ నమోదు ద్వారా విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యా శాఖాధికారులు తెలియజేస్తున్నారు. విద్యార్థి 1వ తరగతి పాఠశాల ప్రవేశ సమయంలో పూర్తి వివరాలు నమోదు చేస్తారు. ఆధార్‌కార్డులో డిజిటల్‌రూపంలో కూడా వివరాలు నమోదు చేయబడతాయి. అపార్ కార్డు ఐడీ ద్వారా ఆధార్ కార్డు వివరాలతో పాఠశాల ప్రవేశ వివరాలు అనుసంధానం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. దీని ద్వారా ఒక విద్యార్థి 1 వ తరగతిలో ప్రవేశ సమయంలో చేయబడిన వివరాలు అతను పీజీ పూర్తి చేసి ఉద్యోగ సాధించేవరకు డిజిటల్ రూపంలో పొందుపరచబడి ఉంటాయి. దీని ద్వారా విద్యార్థుల ఉన్నత విద్యాప్రవేశాల సమయంలో ఆ విద్యార్థి అపార్ ఐడీ నంబర్ చెబితే అతని గత విద్యా సంబంధిత చరిత్ర అంతా ఆన్‌లైన్‌లో చూడవచ్చు. ఉన్నత విద్యా ప్రవేశాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే ఉద్యోగ అన్వేషణ సమయంలో కూడా విద్యార్థి విద్యా ప్రగతి వివరాలు కూడా అ సంస్థ పరిశీలించుకోవడానికి ఉపయోగపడతాయి. దీని ద్వారా విద్యార్థి అల్ టైం ట్రాక్ రికార్డు నమోదు అవుతుంది. కొంతమంది విద్యార్థులు వివిధ రాష్ట్రాలలో వివిధ విద్యాసంస్థల్లో ఏకకాలంలో నమోదవుతూ విద్యాభ్యాసం సాగిస్తుంటారు. మల్టిపుల్ ప్రవేశాల నివారణకు ఇది దోహద పడుతుంది.

ఎలా నమోదు చేస్తారు ?

అపార్ కార్డులు విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల వివరాలు పరిశీలిన చేయాల్సి ఉంది. స్టూడెంట్ డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా అపార్ కార్డులు ఇవ్వనున్నారు. దానిలో భాగంగా కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అన్ని విద్యాశాఖలలో వివరాలు సేకరణ మొదలు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 1,385 ప్రభుత్వ పాఠశాలలో లక్ష 4 వేల మంది విద్యార్థులు 495 ప్రైవేటు పాఠశాలల్లో లక్ష 35 వేల మంది విద్యార్థులు మొత్తం 2 లక్షల 39 వేల మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు 2,364 ఉండగా 3 లక్షల 60 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 30 శాతం మంది విద్యార్థులకు అంటే లక్షా ఎనిమిది వేల మందికి అపార్ నమోదు పూర్తయింది. స్కూల్ రికార్డు పేరులో గాని, ఆధార్‌లో గాని,యూడైస్ పోర్టల్‌లో తప్పులు ఉంటే సరిచేయాలి. స్కూల్ రికార్డులో తప్పును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధార్ కార్డు ఆధారంగా సరిచేస్తారు. ఆధార్ కార్డులో తేడా ఉంటే మీ-సేవలో సరిచేయించుకోవాలి. ఇలా అన్నీ కరెక్టుగా ఉంటేనే అపార్ నమోదు చేస్తారు. ఇప్పటివరకు పాఠశాల విద్య అభ్యసించే విద్యార్థులకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నందు స్టూడెంట్ ఐడీ ఉండేది. దానిని క్లోజ్ చేసేస్తున్నారు. ఇప్పుడు దానిస్థానంలో కొత్తగా అపార్ ఐడీ క్రియోట్ చేస్తున్నారు.

నమోదులో కష్టాలు

అపార్ ఐడీకి సంబంధించి వివరాలు నమోదులో ఉపాధ్యా యులు చాలా కష్టాలు ఎదుర్కుం టున్నారు. గతంలో తప్పుల తడకగా చేయబడిన యూడైస్‌లో విద్యార్థి వివరాలతో నేడు ఆధార్ వివరాలు సరితూగకపోవడంతో అపార్ ఐడీ నమోదు ముందుకు సాగడం లేదు. నూటికి 70% వివరాలు సక్ర మంగా ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో విద్యార్థుల వివరాల నమోదులో దొర్లిన తప్పులు తడకల వల్ల, యూడైస్‌లో విద్యార్థుల వివరాలు నమోదులో దొర్లిన తప్పుల వల్ల ఉపాధ్యాయులు వివరాలు నమోదులో తలలు పట్టుకొని కూర్చొంటున్నారు. వివరాలు నమోదులో ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి ప్రభుత్వం ప్రతి మండలంలో ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపడు తుందని జిల్లా విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అలాగే యూడైస్‌లో కూడా చిన్నపాటి వివరాల నమోదు తప్పులు సరిచేయడానికి ప్రత్యేకంగా పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ కూడా ఇస్తారు.

అపార్ అంటే..

కేంద్ర మానవ వనరుల శాఖ దేశంలో చదువు తున్న విద్యార్థులందరికీ ఏకీకృత ధ్రువీకరణ నంబర్‌ను కేటాయించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే విధంగా ఐడీ నెంబర్‌ను కేటాయిస్తారు.దీనినే అపార్ (apaar ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డుగా పిలుస్తున్నారు.

అపార్‌తో విద్యార్థులకు ప్రయోజనం



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 1 నుంచి 10 వరకు చదివే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అందించేందుకు ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు వివరాలు నమోదు చేయాలి. ప్రస్తుతం యూడైస్ వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థుల వివరాలతో ఆధార్ వివరాలు సరి పోవాలి. ఈ విషయంలో కొన్ని ఇబ్బందులు తొలగించడం కోసం యూడైస్ వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. అలాగే ఆధార్ వివరాలలో తప్పులు సరిచేయడం కోసం ప్రతి మండలంలో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ వెట్రిసెల్వీ ఏర్పాట్లు చేస్తున్నారు. అపార్ కార్డు విద్యార్థి భవిష్యత్ విద్యాభ్యాసానికి, ఉన్నత విద్యా ప్రవేశాలకు, ఉద్యోగ అన్వేషణ పక్రియలో ఎంతగానో ఉపయోగపడుతుంది.

-ఎస్.అబ్రహం డీఈవో, ఏలూరు జిల్లా

సివిల్ సర్వీస్ క్రీడా పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సుమారు 100 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

స్పోర్ట్స్ కాలమ్





కైకరంలో జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఉంగుటూరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చదువు తోపాటు క్రీడలలో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మంచి పేరు సంపాదించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కైకరం ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభించారు. అండర్ -14, అండర్ - 17 బాలురు, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 15 నియోజవకవర్గాల నుంచి 700 మంది క్రీడాకారులు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సర్పంచ్ కలగాల గోపి, ఎంపీపీ మంటా శ్రీలక్ష్మీ, జడ్పీటీసీ కోటిపల్లి జయలక్ష్మీ, ఆర్గనైజింగ్ అధ్యక్ష కార్య దర్శులు గుళ్ల ప్రసాదరావు, జి.నాగసుధ, విద్యాకమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు చింతలపూడి విద్యార్థిని

చింతలపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.భార్గవి జార్ఖండ్ రాష్ట్రం లాంచీలో నవంబరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ హెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో డిస్క్రోలో చాంపియన్ షిప్ పొంది సిల్వర్ మెడల్ సాధించిందని, జాతీయ పోటీలకు ఎంపికవడంపై అధ్యాపకులు అభినందించారు.

ఓటర్ల ముసాయిదా జాబితా

వచ్చే నెల నుంచి కొత్త ఓటర్ల నమోదు

అభ్యంతరాలు డిసెంబరు 24లోపే పరిష్కారం

వచ్చే ఏడాది జనవరి 6న తుది ప్రచురణ



నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
ఉంగుటూరు	1,01,545	1,04,930	06	2,06,531
దెందులూరు	1.09,286	1,15,388	08	2,24,682
ఏలూరు	1,12,308	1,22,714	46	2,35,068
పోలవరం	1,22,959	1,31,372	09	2,54,340
చింతలపూడి	1,34,294	1,38,778	40	2,73,112
నూజివీడు	1,18,063	1,20,863	10	2,38,936
కైకలూరు	1,01,276	1,04,486	05	2,05,767
మొత్తం	7,99,781	8,38,531	124	16,38,436
ఆచంట	88,730	91,020	4	1,79,754
పాలకొల్లు	95,819	99,362	8	1,95,189
నరసాపురం	84780	85,916	---	1,70,696
భీమవరం	1,22,569	1,30,002	50	2,52,621
ఉండి	1,10,209	1,14,583	2	2,24,794
తణుకు	1,14,285	1,19,944	5	2,34,234
టీపీ గూడెం	1,04,389	1,09,502	10	2,13,901
మొత్తం	7,20,781	7,50,329	79	14,71,189

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశమయ్యారు. మూడు నెలల క్రితమే ఎన్నికలు జరిగిన నాటికి, తాజాగా ముసాయిదా ప్రకటించిన నాటికి ఓటర్ల పెరుగుదల అత్యంత స్వల్పంగా నమోదైంది. ఈ మూడు మాసాల వ్యవధిలో పెరిగిన ఓటర్ల సంఖ్య 1006గా ఉంది. అలాగే పురుషులు, మహిళా ఓటర్లలో పెరుగుదల అత్యల్పమే. ఏలూరు జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16 లక్షల 38 వేల 436గా నమోదైంది. పురుష ఓటర్లు గతంలో 7 లక్షల 99 వేల 241 ఉండగా తాజా ముసాయిదాలో ఈ సంఖ్య 7 లక్షల 99 వేల 781గా నమోదు కాగా మొత్తం మీద 540 మంది పెరిగారు. మహిళా ఓటర్లు గతంలో 8 లక్షల 38 వేల 063గా ఉండగా, ఇప్పుడు 8 లక్షల 38 వేల 5431 నమోదవగా 468 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్ల సవరణపై నెల రోజులపాటు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తామని, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలు బీఎల్‌వోలను నియమించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. బూత్ స్థాయిలో నవంబర్ నెలలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తారని, బీఎల్‌వోలు బూత్ వద్దే క్లెయిమ్‌లను, అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌వో బి.విశ్వేశ్వరరావు, నెర్సు బాలరాజు (బీజేపీ), ఎస్.బాబూ ప్రసాద్ (కాంగ్రెస్), ప్రసాద్ (సీపీ ఐఎం), సిర్రా భరత్, డి.రత్నబాబు (బీఎస్పీ), బాలానందం, అచ్యుతబాబు, టి.విష్ణు (టీడీపీ), ఎ.రవి, పి.ఆది శేషు (సీపీఎం) పాల్గొన్నారు.

పశ్చిమలో 14.71 లక్షల మంది..

భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి పూర్తిస్థాయి ఓటర్ల జాబితా ప్రకటించనున్నది. అందులో భాగంగా మన జిల్లాకు సంబంధించిన డ్రాఫ్టును మంగళవారం విడుదల చేశారు. 29వ తేదీ నుంచి వచ్చేనెల 28 వతేదీవరకు అభ్యంతరాలకు దరఖాస్తులను అందించవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది. వచ్చేనెల 9, 10, 23,24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వచ్చిన దరఖాస్తులను డిసెంబరు 24వ తేదీ నాటికి పరిష్కరిస్తారు. వచ్చే ఏడాది జనవరి 1న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 6న పూర్తిస్థాయి ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. దీని ప్రకారం జిల్లాలో 14 లక్షల 71 వేల 189 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7 లక్షల 20 వేల 781 మంది ఉండగా మహిళలు 7 లక్షల 50 వేల 329 మంది ఉన్నారు. థర్డ్ జండర్స్ 79 మంది ఉన్నారు.



ఎంపికైన బాలుర జట్టు

బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి జట్లు ఇవే

పెనుమంట్ర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :పెను మంట్ర మండలం మార్టేరులో స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుంచి ఆడిన టీంల నుంచి బాలుర జట్టు బాలికల జట్టు ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ సెక్రెటరీ చక్రవర్తి, రాష్ట్ర బాస్కెట్బాల్ సెక్రెటరీ మల్లేశ్వర రావు తెలిపారు బాలికల విభాగంలో ఎస్కే ఆసరా(కృష్ణా జిల్లా) బి.ప్రణవి (కృష్ణా జిల్లా) జీ.కిరణ్మయి (అనంతపురం) మానస (తూర్పుగోదావరి) పి.నందిని (పశ్చిమ గోదావరి) హిమ వర్షా (అనంతపురం) చరిష్మా (ఈస్ట్ గోదావరి) నేహా(చిత్తూరు) దుర్గ (కృష్ణ) ఎస్.కె ఫర్హాన్ (గుంటూరు) ఐశ్వర్య (వైజాగ్) మౌనిక (కర్నూల్) స్టాండ్ బైగా అమృత(వెస్ట్ గోదావరి) హర్షిత(ఈస్ట్ గోదావరి) దేదీప్యసాయి (అనంతపురం) ఎంపిక చేసినట్లు ప్రకటించారు బాలుర విభాగం రాష్ట్ర జట్టు ఎంపిక బాలాజీ (కృష్ణ) రేవంత్ (కృష్ణ) కిషోర్, సాంబశివ (వెస్ట్ గోదావరి) మదన్ (నెల్లూరు) హేమంత్ (తూర్పుగోదావరి) సంజయ్(అనంతపురం) పి జాషువా(నెల్లూరు) లలిత్(చిత్తూరు) కేదార్(కృష్ణా) భరత్ వర్ధన్ (విశాఖ) అఖిల్(గుంటూరు) స్టాండ్‌బైగా స్వర్ణ కుమార్ (కర్నూల్) తేజ హర్ష (తూర్పు గోదావరి) యశ్వంత్ (అనంతపురం)ఎంపికయ్యారు.



ఎంపికైన బాలికల జట్టు

పట్టిసీమలో వసతులేవి ?

కార్తీకమాసంలో భక్తుల తాకిడి

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

కార్తీక మాసం వచ్చేస్తోంది. ప్రసిద్ధి చెందిన పట్టిసీమ శివక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తూంటారు. కార్తీక మాసం నెలరోజుల పాటు ఆలయానికి భక్తుల రాకపోకలు ఉంటాయి.ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆలయ ప్రాంగణంలో మంచినీటి సరఫరా చేసే ఆర్వో ప్లాంటు పని చేయడంలేదు. దీంతో ఆలయ సిబ్బంది బోరు నుంచి మోటార్ల ద్వారా తోడిన నీటిని నేరుగా భక్తులకు అందిస్తున్నారు. ఫెర్రీ రేవులో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ లోపం వల్ల దుర్గంధం వస్తోంది. నీటి సదుపాయం లేక అధ్వాన్నంగా ఉన్నాయి. ఫెర్రీ రేవు వద్ద గానీ ఇసుక తిన్నెల్లో గానీ మహిళలు దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులు లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయం వైపు నదీ తీరంలో భక్తులు స్నానాలాచరించే ప్రాంతాల్లో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. బారికేడింగ్ లేకపోవడం వల్ల భక్తులు నదీ ప్రమాదాల బారినపడే ప్రమాదం ఉంది. ఆలయానికి రాకపోకలు సాగించే రేవు లాంచీ నిర్వాహకులు పరిమితికి మించి భక్తులను ఎక్కించుకోవడం , లైఫ్ జాకెట్లు ఉన్నా వేసుకోకపోవడం లాంచీల రాకపోకలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నదీ స్నానాల కోసం ఫెర్రీ రేవు అనువుగా లేకపోవడం వల్ల భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు గతంలో పట్టిసీమ ఫెర్రీరేవులో ఏర్పాటు చేసిన షవర్లకు మరమ్మతులు చేయిస్తే బావుంటుందని పలువురు భక్తులు సూచిస్తున్నారు. లాంచీ నిర్వాహకులు నిర్దిష్ట ధరల నియమం పాటించకుండా చార్జీలు వసూలు చేస్తున్నారని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పోలవరం



ఉపయోగంలో లేని ఆర్వో సిస్టం



కానరాని బట్టలు మార్చుకునే గదులు



పని చేయని షవర్లు





ఇది బస్టాండేనా !

ఆకివీడు ఆర్టీసీ కొత్త బస్టాండ్‌కు కంట్రోలర్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొత్త బస్టాండ్‌లో కార్లు పార్కింగ్ చేస్తు న్నారు. విద్యార్థులు క్రికెట్ ఆడుకుంటున్నారు. దీంతో బస్సులు బస్టాండ్ పాయింట్‌లోకి రాకుం డానే డ్రైవర్లు దూరంగా ఆపి వేగంగా వెళ్లిపోతుండడంతో వృద్ధులు, దివ్యాం గులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు.బస్టాండ్‌లో తాగడానికి మంచినీటి సౌకర్యం లేదు. ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో వాహనాలు పెట్టుకుంటే వాహనానికి రూ.100, క్రికెట్ ఆడుకోనిచ్చినందుకు రూ.200 స్లీపర్ తీసుకుంటున్నట్లు తెలుపుతున్నారు. బస్టాండ్ వెనుక డ్రెయినేజీ ఆక్రమణలకు గురై పూడుకు పోయింది. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని బస్టాండ్‌లో కూర్చోలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందు బాబులకు నిలయంగా తయారైంది. అధికారులు జోక్యం చేసుకొని బస్టాండ్‌ను కాపాడాలని కోరుతున్నారు.

-ఆకివీడు

అధికారులు పట్టించుకోవాలి

కంట్రోలర్ లేకపోవడంతో ఇష్టానుసారంగా నడుస్తోంది. బస్టాండ్ ప్రాంగణంలో పెట్టుకుంటున్న కార్లుకు కారును బట్టి రూ.100 పైనే వసూలు చేయడం, విద్యార్థులు క్రికెట్ ఆడుకుంటున్నందుకు కూడా డబ్బులు తీసుకుంటున్నట్లు చెప్తున్నారు. రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారింది. ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు బస్టాండ్ పాయింట్ లోకి వెళ్ళకుండా వెళ్ళిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పాలవుతున్నారు.దుర్వాసనతో బస్టాండ్‌లో కూర్చోలేకపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.





దొడ్డి అప్పారావు, ప్రయాణికుడు, మంగిన విష్ణు, స్థానికుడు, ఆకివీడు



ఆక్వా వర్సిటీలో రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తి

» 30 మంది చేరిక, మొదలైన తరగతులు
» నవంబరు మొదటివారంలో మూడో కౌన్సెలింగ్

నరసాపురం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఆక్వా యూనివర్సిటీలో మొదటి ఏడాది ప్రవేశాల్లో భాగంగా ఇప్పటివరకు రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. 60 సీట్లకు గాను 30 సీట్లు భర్తీ అయ్యాయి. నవంబరు 1,2 తేదీల్లో మూడో విడత కౌన్సెలింగ్‌ను పూర్తి చేయనున్నారు. ఆక్వాకు సంబంధించిన డిగ్రీ మొదటి ఏడాదిలో చేరికకు 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్‌లో బైపీసీ చదివి ఏపీఈఏపీ ర్యాంకులు సాధించిన విద్యార్థులకే ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. 2022లో అప్పటి సీఎం జగన్ ఈ కాలేజీకి శంకుస్థాపన చేయగా.. గత ఏడాది అప్పటి మత్స్యశాఖామంత్రులు సిదిరి అప్పలరాజు మండలంలోని లక్ష్మణేశ్వ రం గ్రామంలో తాత్కాలి కంగా ఏర్పా టు చేసిన తరగతుల్ని ప్రారంభించారు. ఇప్పటికే ఒక ఏడాది పూర్తయింది. రెండో బ్యాచ్ ఈ ఏడాది అడ్మిషన్లు తీసుకుంది. మొత్తం నాలుగేళ్ల కోర్సు చదివితే డిగ్రీ పూర్తి చేసినట్టు అవుతుంది.

అరకొర వసతులతో..

రెండేళ్ల క్రితం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మాత్రం జరగలేదు. నరసాపురం మండలంలోని తుఫాన్ భవనంలోనే తాత్కాలిక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ భవనాన్ని కాలేజీగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది అదనంగా మరో తరగతి పెరగడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తాయి. ల్యాబ్‌లు కూడా లేవు. మరో చోటకు తరలించాలని ప్రయత్నిస్తున్నారు. మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు అంగీకరించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి తరగతుల్ని ఏర్పాటు చేస్తామని కాలేజీ డీన్ నీరజ తెలిపారు.

మరో రెండేళ్లలో పీజీ ప్రారంభం

ప్రస్తుతం యూనివర్సిటీ అయినప్పటికీ పీజీ లేదు. మరో రెండేళ్లల్లో పీజీ ప్రారంభమవుతుంది. అంటే ఆ కాలేజీలో మొదటి ఏడాది పూర్తి చేసిన విద్యార్థులు నాల్గో సంవత్సరం డిగ్రీ పూర్తికాగానే పీజీకి అర్హులవుతారు. అప్పటి వరకు యూనివర్సిటీ కాలేజీగానే కొనసాగుతుంది. ఇప్పటివరకు ఆక్వాకు సంబంధించి డిగ్రీ కోర్సులే ఉన్నాయి. అవి కూడా కావలి, బాపట్ల, నరసాపురంలోనే ఉన్నాయి. ఈ కాలేజీల్లో డిగ్రీ పూర్తి చేసినవారంతా మరో రెండేళ్ల తరువాత ఈ యూనివర్సిటీలో చేరేందుకు అవకాశం ఉంటుంది. అప్పటిలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



పోలవరంలో కడమ్మ స్లూయిజ్ వద్ద అధికారులతో రైతులు

కడమ్మ స్లూయిజ్ గేట్ల పరిశీలన

పోలవరం అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కడమ్మ స్లూయిజ్ గేట్లను అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ ఆనంద్‌బాబు, ఏఈ మణికంఠలతో జనసేన మండల నాయకుడు కొణతాల ప్రసాద్ మాట్లాడారు. ప్రతి ఏటా కడమ్మ స్లూయిజ్ గేట్ల ద్వారా నీటి విడుదల కష్టతరమై కొండవాగుల నీరు, కొవ్వాడ కాల్వ నీరు నిలిచి వెయ్యి ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని రైతులు నష్టాల పాలవుతున్నారని ఆ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి జలాలు గోదావరిలోకి వెళ్ళేలా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వానికి ఈ విషయంపై నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రైతులు మంగిన కొండ, సిద్దన వెంకటరత్నం, ఎదిరేసి వెంకట్రావు, అనిశెట్టి రాధయ్య, కరిబండి ప్రభాకర్, వారాడి సత్తిబాబు, రాంబాబు, కాపా రాంబాబు, కుడిదాల శ్రీను పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితా

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థ, మరో ఏడు పురపాలక సంఘాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు సీనియార్టీ జాబితాలను డీఈవోఏలూరు.ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో పొందుపర్చినట్టు డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవదాని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాల్లో ఏమైనా అభ్యంతరాలుంటే నవంబరు ఒకటో తేదీలోపు ఏలూరు డీఈవో కార్యాలయంలో తగిన రుజువులతో అందజేయాలని కోరారు. జిల్లాలోని పాలకొల్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, తణుకు, నిడదవోలు పురపాలక సంఘాల పాఠశాలల్లో ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ ప్రమోషన్లకు మొత్తం 426మంది, స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం పదోన్నతులకు 305 మందితో కూడిన సీనియార్టీ జాబితాలను సిద్ధం చేశారు. ఏలూరు కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్జీటీనుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతికి 226 మంది, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌నుంచి హెచ్‌ఎం ప్రమోషన్లకు 164మందితో కూడిన జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇక కేడర్లవారీగా ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లో ఎంతమందికి పదోన్నతులు ఇవ్వనున్నారో ప్రభుత్వంనుంచి మంగళవారం వరకు స్పష్టత లేదు.



స్థానికుల చేతిలో హతమైన కొండచిలువ

కొండ చిలువ హతం

పెంటపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పది అడుగుల కొండ చిలువ స్థానికుల చేతిలో హతమైంది. మండలంలోని అలంపురం ఎస్టీ కాలనీలో కొన్ని రోజులుగా కొండచిలువ తిరుగుతుంది. కాలనీలో కోళ్ళు కూడా మాయమవుతుండడంతో స్థానికులు నిఘా పెట్టారు. మంగళవారం కాలనీలోని గడివాములో పది అడుగుల కొండచిలువ కనిపించడంతో స్థానికులు కొండ చిలువను హతమార్చారు.



చెక్కు అందజేస్తున్న నారా శేష

మలేషియాలో నృత్య ప్రదర్శనకు హర్షిత ఎంపిక

ఏలూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సురేశ్ చంద్రబహుగుణ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బావిశెట్టివారిపేటకు చెందిన అల్లిబిల్లి హర్షిత డిసెంబరు 27న మలేషియాలో జరిగే భారతీయ నృత్య ప్రదర్శనకు ఎంపికైంది. ప్రదర్శనకు బాలిక ఎంపిక కావడం పట్ల జనసేన నాయకులు నారా శేష అభినందించి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు.

అదరగొట్టిన చిన్నారులు

» ముగిసిన విజ్ఞాన ప్రదర్శనలు
» అలరించిన విద్యార్థుల కోలాటం



ఓల్డ్, స్మార్ట్ విలేజ్‌లు..

పురాతన కాలంలోని గ్రామాలు, ప్రస్తుత స్మార్ట్ విలేజ్‌లకు మధ్య వ్యత్యాసాన్ని ప్రాజెక్ట్ రూపంలో నరసాపురం గురుకుల ఏడో వతరగతి విద్యార్థులు హెచ్ సాయిలక్ష్మి, వి స్నేహ ఓ ప్రాజెక్ట్‌ను ఆవిష్కరించారు. పురాతన కాలంలో రోడ్లులేవు, విద్యుత్ వెలుగులు కరువు. మరి ఆధునిక గ్రామాల్లో సోలార్ సిస్టం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు విద్యుత్‌ను బ్యాటరీలలో నిల్వ చేసి రాత్రి సమయాల్లో వినియోగించుకోవచ్చని వివరించారు.




ఎమ్మెల్యే మద్దిపాటి సమక్షంలో విద్యార్థుల కోలాట ప్రదర్శన.. విద్యార్థుల వేషధారణలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లలో కంటే ఎందులోనూ తక్కువ కాదని గురుకులాల్లో విద్యార్థులు నిరూపించారు. తమకున్న ప్రతిభాపాటవాలను జోడించి టెక్నాలజీ సాయంతో పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. చూపరులను ఆలోచింప చేసే విధంగా ఉన్న ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వచ్చి ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థుల నుంచి వాటి ముఖ్య ఉద్దేశ్యాన్ని అడిగి తెలుసుకుని వారిని ప్రశంసించారు. సోమవారం ద్వారకాతిరుమలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రారంభమైన సైన్స్ ఫెయిర్ మంగళవారంతో ముగిశాయి. పలు ప్రదర్శనలతో పాటు సీతారామలక్ష్మణుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ బి.రాణి నేతృత్వంలో కార్యక్రమం విజయవంతమైంది.



భవిష్య భూమి-2080..

భూమిని, పరిసరాలను మనిషి కలుషితం చేస్తున్నాడు. ప్రతీ జీవి భూమిలో కలిసిపోతాడు. పెట్రో ఉత్పత్తుల వంటి ఇంధనాలను కాకుండా మనిషి సహజవనరులైన సౌరశక్తి, జలశక్తి, వాయుశక్తిలను వినియోగించాలి. పెట్రో ఉత్పత్తుల వల్ల కాలుష్యం పెరుగుతోంది. ఇది ఆపకుంటే భూమిపై ఉష్ణోగ్రత పెరిగి మనిషి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. దీనిని రాజమండ్రి గురుకులం విద్యార్థులు కె.వర్షి, సీహెచ్ సోన డెమో చేసి చూపించారు.



పీపుల్ కౌంటింగ్ డివైజ్..

జనగామ జిల్లాలో ఓ షాపింగ్ మాల్‌లో కొన్నాళ్ల క్రితం జరిగిన అగ్నిప్రమాదాన్ని దృష్ట్యా రూపొందిం చినట్టు వట్లూరు గురుకులంకు చెందిన విద్యార్థులు సీహెచ్ నందిని, పి.లీల తెలిపారు. జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలైన షాపింగ్ మాల్స్, సినిమాహాల్స్ ఆలయాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. అగ్ని, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు లోపలకు వెళ్లిన వారు ఎంత మంది ఉన్నారో ఐఆర్ సెన్సార్ ద్వారా కౌంటింగ్ డిస్ప్లేలో చూపుతుంది. దీనివల్ల ఇంకా ఎంత మందిని కాపాడాలో తెలుస్తుంది.



గ్రీన్ ఐటీ..

ఈ ప్రాజెక్టును ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.కుందన తన టీచర్ డిసౌజాతో కలిసి ప్రదర్శించారు. రైతులు తేలిక పద్ధతిలో అంటే తన మొబైల్‌ను ఆపరేట్ చేసి వ్యవసాయం చేయడం ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. పశువుల, పంటల ఆరోగ్య పరిస్థితిని గుర్తించవచ్చు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతుల పంటకు నీటి అవసరం తెలుస్తుంది. కొత్త టెక్నిక్ ద్వారా సులభ పద్ధతుల్లో రైతు మంచి దిగుబడి సాధించవచ్చని ప్రాజెక్టు ఉద్దేశ్యం. ఎమ్మెల్యే వెంకట్రాజు పరిశీలించారు.



చిత్తం కొద్దీ చినుకులు..

వర్షాధారిత వ్యవసాయ ప్రదేశం ఇది. తుఫాన్‌లు, అకాల వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం కలుగుతోంది. వెదర్ మేనేజ్‌మెంట్ ద్వారా మనం ప్రకృతి ఉపద్రవాలను అరికట్టవచ్చు. సహజ టెక్నిక్‌లను ఉపయోగించి వర్షాలను అదుపులో ఉంచొచ్చు అనేది ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. సముద్రపు ఉష్ణోగ్రత 26.5 కంటే ఎక్కువగా పెరిగితే సైక్లోన్ ఏర్పడుతుంది. ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలు పద్ధతులను వాడారు. మనం కోరుకున్నప్పుడు వర్షం పడేలా చేయొచ్చని రాజమహేంద్రవరం గురుకులం విద్యార్థిని సుజన చెబుతున్నారు.



ఉపద్రవాలను తెలుసుకోవచ్చు..

కృష్ణాజిల్లా బల్లిపర్రుకు చెందిన కె. మీనాక్షి దీనిని ఆవిష్కరించింది. ఎంత అభివృద్ధి చెందిన, చెందని దేశాల్లో అయినా వరదల వల్ల తీవ్రనష్టం వస్తోంది. ఈ కారణంగా ఆస్తి నష్టం, ప్రాణనష్టం సంభవించి మనిషి జీవితం అతలాకుతలం అవుతోంది. తాజాగా విజయవాడను ముంచెత్తిన వరదల కారణంగా ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ముందుగా వాటర్ లెవెల్ పెరుగుతుంటే ఈ టెక్నాలజీ ప్రజలను అప్రమత్తం చేస్తుంది. డామ్‌లు, రిజర్వాయర్ల వద్ద ఈ సెన్సార్‌ను అమర్చితే నీటి మట్టం పెరిగినప్పుడు బజర్ మోగి ప్రజలు అప్రమత్తం అవుతారు. ఈప్రాజెక్ట్‌లో కొన్ని ప్రతికూల అంశాలను తెలిపారు. ఒక్కోసారి వైఫై కమ్యూనికేషన్ సిస్టమ్ పనిచేయొచ్చు లేకపోవచ్చు కాబట్టి అలర్ట్ చేయడం సాధ్యం కాకపోవచ్చన్నారు.

సచివాలయం ఎదుట చెత్త డంప్



జాలిపూడి గ్రామ సచివాలయం ఎదుట చెత్త వేసిన సిబ్బంది

ఏలూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గత వైసీపీ ప్రభుత్వం జీతాల బకాయి చెల్లించకుండా వారి కడుపుకొట్టింది. కడుపు మండిన కార్మికులు జాలిపూడి సచివాలయం వద్ద చెత్తపోసి మంగళవారం నిరసన తెలిపారు. గోగులమూడి ప్రశాంతి, బళ్ళవరపు రాఘవులు, మరియన్న, వెంకటర మణలకు సుమారు ఐదునెలల బకాయి జీతాలు చెల్లించాల్సి ఉంది. సర్పంచ్, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆకలి మంటతో చెత్తపోసి తమ నిరసన తెలిపినట్టు ప్రశాంతి తెలిపింది. తప్పనిపరిస్థితిలో సచివాలయం వద్ద చెత్తపార బోస్తే అధికారులు స్పందిస్తారని ఈ ఘటనకు పూనుకున్నట్లు స్పష్టం చేసింది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు, ఏలూరు ఎంపీడీవో శ్రీలత అక్కడకు చేరుకుని బకాయి జీతాలు చెల్లించే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

పలువురు వార్డు సభ్యులు, టీడీపీ నాయకులు మాట్లాడుతూ పంచాయతీలో నిధులు దారిమళ్ళాయని, గతంలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో పారిశుధ్య కార్మికుల జీతాలు ఉన్నాయని ఆరోపించారు. తిరిగి విచారణ చేయాలని ఎంపీడీవోను కోరారు. ఈ ఘటనపై సర్పంచ్ వి.నవ్య స్పందిస్తూ పారిశుధ్య కార్మికురాలు గోగులమూడి ప్రశాంతిని ఎప్పుడో తొలగించామన్నారు. పంచాయతీకి ఆమెకు ఎటువంటి సంబంధం లేదని, ఆమె జీతం కూడా తమకు సంబంధం లేదని తెలిపారు.

విద్యార్థులకు 'కౌశల్' సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే 'కౌశల్-2024' రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభానేష్వణ పోటీలు నిర్వహిస్తామని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు తెలిపారు. మంగళవారం సంబంధిత పోస్టర్లను విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. వివరాలను 'కౌశల్' జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వరరావు పత్రికలకు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న బాలబాలికలకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాలస్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ఒక్కో పాఠశాలనుంచి 15 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు నవంబరు 15లోగా www.bvmap.org వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో నమోదుచేసుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో ఆన్‌లైన్ పరీక్ష నవంబరు 20నుంచి 22 వరకు, జిల్లా స్థాయిలో డిసెంబరు 6న, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 30న నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 81420 35942, 83093 72875 నంబర్లలో సంప్రదించాలని కోరారు. భారతీయ విజ్ఞాన మండలి ప్రతినిధులు పద్మావతి, విజయరత్నబాబు, అరుణ పాల్గొన్నారు.

సంఘం నుంచి పీఎంపీ వైద్యుడి బహిష్కరణ

మొగల్తూరు, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య సేవలు అందిస్తున్న కాళీపట్నం గ్రామీణ వైద్యుడు కటికరెడ్డి జగన్నాథరావును పీఎంపీ సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌పీఎన్ ముక్తేశ్వర రావు, సీహెచ్‌వీపీ శ్రీనివాస ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలందిస్తున్నాడని సంఘానికి ఫిర్యాదు రావడంతో విచారించి నిర్ధారణ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలిపారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

ఇద్దరి అరెస్ట్

ద్వారకాతిరుమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఐఎస్ జగన్నాథపురంలో సారా తయారీ కేంద్రాలపై అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మటపర్తి అన్నవరం, రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద వున్న 800 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. వారిని అరెస్ట్ చేసి భీమడోలు కోర్టు ముందు హాజరుపర్చారు.

- బెల్ట్ షాపుల నిర్మూలనకు భీమడోలు సర్కిల్ పరిధిలోని పలు గ్రామాల్లో దాడులు చేసి ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కె.ఎండి. ఆరిఫ్ తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మోటారుసైకిల్‌పై నాటుసారా తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణా జిల్లా కృత్తివేణు మండలం, పోడు గ్రామానికి చెందిన బొర్రా నాగబాబు మంగళవారం మోటారుసైకిల్‌పై పది లీటర్ల సారా తీసుకెళ్తుతుండగా ఉప్పుటేరు వంతెన వద్ద ఎక్సైజ్ సీఐ మద్రి శ్రీనివాస్, ఎస్‌ఐ వి.కరుణప్రియ అరెస్టు చేశారు. మోటారు సైకిల్, సారా స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. భీమవరం కోర్టుకు పంపించగా రిమాండ్ విధించి ఏలూరు సబ్ జైలుకు తరలించారన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి

కుక్కునూరు, అక్టోబరు 29 : సీతారామనగరం గ్రామానికి చెందిన బొల్లా సంతోష్ (27) అనే యువకుడు మంగళవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుక్కునూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి.. గ్రామంలో యువకుడు వ్యవసాయం చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలం వద్ద మృతి చెంది ఉన్నాడు. శరీరంపై అక్కడక్కడ గాయాలున్నాయి. పురుగుమందు తాగిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇది హత్యా లేదా ఆత్మహత్య అనే విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెంటపాడు, అక్టోబరు 29 :రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గణపవరం మండలం చిలకంపాడుకు చెందిన పొట్నూరి చిన్నయ్య(45) పని నిమిత్తం ఈనెల 28న పెంటపాడు మండ లం ముదునూరు మోటార్‌సైకిల్‌పై వస్తుండంగా ముదునూరు సమీపంలో ఉన్న అరుంధతి పేట వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైన చిన్నయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ మేరకు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ బాబూరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

అత్తిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలం శివాపురంలో విద్యుదాఘాతంతో గండికోట సాయిబాబా(28)అనే వ్యక్తి మృతి చెంది నట్టు అత్తిలి ఎస్‌ఐ పి.ప్రేమరాజు తెలిపారు. ఆచంట మండలం కొడమంచిలికి చెందిన సాయిబాబా శివాపురంలో రోడ్డు పనుల నిమిత్తం వచ్చాడు. కాంక్రీట్‌తో వచ్చిన లారీ దిగుమతి చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు లారీ పైభాగానికి తగిలి షాక్ కొట్టడంతో ఆసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో నుంచి అత్తను బయటకి నెట్టి తాళం వేసిన కోడలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలైన తాణంకి వెంకాయమ్మను చిన్న కోడలు, ఆమె కుమారుడు కలిసి బయటకు నెట్టి, సామగ్రిని బయటపెట్టి ఇంటికి తాళం వేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. బాధితురాలు తాణంకి వెంకాయమ్మ తెలిపిన వివరాలివి.. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని, పెద్ద కుమారుడు ఇంటివద్ద కొంతకాలం ఉన్న తర్వాత ఇంటిని పడగొట్టి వేరే చోట భవనంలో నివాసం ఉంటున్నాడు. చిన్న కుమారుడు మరో ఇంట్లో ఉంటూ ఖాళీగా ఉంటున్న వేరే ఇంట్లో ఉండమని తల్లికి చెప్పగా రెండు నెలలుగా ఉంటుంది. ఈక్రమంలో వెంకాయమ్మకు ఉన్న ఇంటి స్థలాన్ని పెద్ద కుమారుడికి రాసిందనే అనుమానంతో చిన్న కోడలు తన కుమారుడితో కలిసి సోమవారం ఆమె సామగ్రిని బయటపెట్టి వేరే చోటికి వెళ్ళిపొమ్మని చెప్పి ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయారు. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఐ కృష్ణబాబు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకుని ఆమెకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తల్లిని పట్టించుకోకుండా వదిలేసిన ఇద్దరు కుమారులకు నోటీసులు ఇచ్చి ఆర్డీవో కోర్టుకు హాజరు కావాలని ఆదేశించారు.

భార్యను గాయపర్చిన భర్త

పాలకోడేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన భార్యపై అనుమానంతో భర్త గాయపరిచిన ఘటన మొగల్లులో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చెదలవాడ గంగన్న, భార్య సుశీల ఇద్దరూ వృద్ధులే. వీరు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భర్త గంగన్నకు భార్య సుశీలపై కొన్ని రోజులుగా అనుమానం రేకెత్తింది. ఆ కోపంలో మంగళవారం భార్యను కొట్టడంతో గాయపడింది. కుటుంబసభ్యులు ఆమెను విజయవాడ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పాలకోడేరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

మొగల్తూరు, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం తలెత్తడంతో ఓ వ్యక్తిపై హత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ జి.వాసు మంగళవారం తెలిపారు. మండలంలోని మోడి గ్రామానికి చెందిన మారెళ్ళ రాంబాబు (48) శనివారం రాత్రి మద్యం సేవించేందుకు ముత్యాలపల్లికి వెళ్ళాడు. మద్యం సేవించి వస్తుండగా మోడి సెంటర్‌లో రామాలయ పునఃనిర్మాణ సమావేశం జరుగుతోంది. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన రాం బాబుకు అదే గ్రామానికి చెందిన జడ్డు నాయుడు. మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన ఉంగరాల వీరన్న మధ్య వివాదం నెలకొంది. ఆవేశానికి గురైన నాయుడు, వీరన్న రాంబాబును కొట్టడంతో గాయాలపాలై మృతి చెందాడు. మృతుడి భార్య వెంకట కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. విచారణలో నాయుడు, వీరన్నలే కొట్టడంతో రాంబాబు మృతి చెందినట్టు తేలిందన్నారు. మంగళవారం గ్రామంలోని వారి ఇంటి వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అనధికారికంగా బాణసంచా అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఫ్రూట్స్ మార్కెట్‌లో ఎలాంటి అనుమతి లేకుండా బాణ సంచా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. బాణసంచా అనధికారికంగా ప్యాకింగ్ చేసి ప్యాకేజ్‌గా అందించేందుకు సిద్ధం చేసిన సరుకును స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

వైద్యం నిర్లక్ష్యం వల్లే తల్లీబిడ్డ మృతి

» ప్రైవేటు ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

చింతలపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వైద్యం నిర్లక్ష్యం వల్ల తల్లీబిడ్డ మృతి చెందారని ఆరోపిస్తూ స్థానిక సాయిస్ఫూర్తి ప్రైవేటు ఆసుపత్రి వద్ద తల్లి మృత దేహంతో మంగళవారం బంధువులు ఆందోళన జరిపారు. బంధువులు తెలిపిన వివరాలివి.. వెంకటాపురానికి చెందిన కోడూరి పరిమళ కిరణ్ గర్భం దాల్చినప్పటి నుంచి ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ప్రసవం కోసం ఈనెల 26న ఆసుపత్రిలో చేరారు. 27వ తేదీ అర్ధరాత్రి ప్రసవం నొప్పులు వచ్చినప్పుడు వైద్యులు లేకుండా నర్సులే ప్రసవం జరిపారని, పుట్టిన బిడ్డ కొద్దిసేపటి తరువాత మృతి చెందినట్టు చెప్పారు. పరిమళకు అధిక రక్తస్రావం కావడంతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది. బంధువులు ఆగ్రహంతో ఆమె మృతదేహంతో ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. చింతలపూడి సీఐ రవీంద్ర ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం ఈ ఘటనపై డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట విచారణ జరిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని, తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి వరకు బంధువుల ఆందోళన కొనసాగుతూనే ఉంది.



పోలీసుల రక్తదానం

తణుకు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరులు సంస్మరణోత్సవాలను పురస్కరించుకుని రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పోలీసులు రక్త దానం చేశారు. ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఆదినారాయణ, డీఎస్పీ డి. విశ్వనాథ్, పట్టణ సిఐ ఎన్.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పెంటపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మౌంజీపాడులో స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ ఆలపాటి రామకృష్ణ ప్రారంభించారు. సంస్థ ప్రతినిధి అజోర్ ఉచితంగా క ంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్ళు రాయితీపై అందిస్తామన్నారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి, కార్యదర్శి బుంగా శిరీష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

విద్యుత్ భారం వద్దు

తణుకు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ పేరుతో ప్రజలపై వేసిన రూ. 6072 కోట్ల విద్యుత్ భారాన్ని కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం వై-జంక్షన్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు గార రంగారావు, చిన్న, సూరిరావు, కృష్ణ, రాంబాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

మెగా లక్కీడ్రా విజేతలకు బహుమతులు

తణుకు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టాభి ఆగ్రో ఫుడ్స్‌కు చెందిన శ్రీలోహిత ఫుడ్స్ వినాయక చవితి సందర్భంగా మెగా లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు గమిని రాంబాబు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. జిల్లాలో ఇద్దరు 10 గ్రాముల బంగారం, 38 మంది ఎలక్ట్రిక్ రైసు కుక్కర్లు గెలుచుకున్నారు. సంస్థ ఈడీ కృష్ణగోవింద్, యర్రంశెట్టి నరసింహారావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల్లో భాగంగా బుధవారం పెంటపాడు, ముదునూరు, యానాలపల్లి, పరిమెళ్ళ, పడమరవిప్పర్రు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ కే.నర్సింహమూర్తి తెలిపారు.

సేవలకు గుర్తింపుగా డాక్టరేట్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ సంఘంలో ఎనిమిదేళ్లుగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా సంఘ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మికి మంగళవారం హైద్రాబాద్‌లో సన్‌రైజ్ వర్సిటీ డాక్టరేట్‌ను అందించారు. విజయలక్ష్మిని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ సభ్యులు అభినందించారు.

ఇళ్ల తొలగింపునకు గడువు ఇవ్వాలి

ఆకివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాలువగట్టున నివశిస్తున్న ఇళ్ల తొలగింపు నిలుపుదలచేసి ఆరు నెలలు గడువు ఇవ్వాలంటూ బాధితులు కలెక్టర్‌ను వేడుకున్నారు. మంగళవారం భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేసి కలెక్టర్ నాగ రాణికి వినతిపత్రం అందచేశారు. కేతవిటి నాయుడు, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, డోకల రవితేజ, అప్పన్న, శ్రీను, అప్పారా వు, సర్కార్, అప్పలకొండ, భవాని, కుమారి, లక్ష్మి, వజ్రం తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆచంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు కోరారు. మంగళవారం ఆచంట సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తహసీల్దార్ ఎం. సోమేశ్వరరావులు ప్రారంభించారు.

సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి

ఆచంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళిత పేటలో ఉన్న డ్రెయినేజీలు బాగు చేసి అభివృద్ధి చేయాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ళ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కందరవల్లిలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల యూత్ ఉపాధ్యక్షుడుగా రావి వెంకటేశ్వరరావు, కందరవల్లి గ్రామ అధ్యక్షుడుగా ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా కుక్కల వెంకటేశ్వరరావులను నియమించి నియామపత్రాలను అందజేశారు.

షర్మిలను విమర్శిస్తే ఊరుకోం

భీమవరం అర్బన్/పాలకొల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పీసీసీ ప్రెసిడెంట్ వైయస్ షర్మిలను విమర్శిస్తే ఊరుకోమని కాంగ్రెసు పార్టీ భీమవరం ఇన్‌చార్జ్ అంకెం సీతారామ్ హెచ్చరించారు. మాజీ సీఎం జగన్ అనుచరులు వారం రోజులుగా షర్మిల రెడ్డిపై చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. షర్మిలకు అండగా కాంగ్రెసు పార్టీ ఉందన్నారు. షర్మిల రెడ్డిని విమర్శిస్తే ప్రతి విమర్శలు తప్పవని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పీసీసీ సభ్యుడు కొర్రగింజల హరికిరణ్ హెచ్చరించారు.



మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు



అందాల దీపాలు





ఆకట్టుకుంటున్న ప్రమిదలు

ఆకివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపాల పండుగ దీపావళి. పట్టణంలో రంగురంగుల ప్రమిదల అమ్మకాలు జోరందుకున్నాయి. కుంద, తులసికోట, కొబ్బరికాయ, తమలపాకు, కుండలు, లాంతర్ తదితర ప్రమిదలు విక్రయాలకు సిద్ధం కాగా కొనుగోలు చేసే ందుకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ప్రమిదలు సైజునుబట్టి ధరలు పలుకుతున్నాయి.



ధాన్యం ట్రాక్టర్లు ప్రారంభిస్తున్న బొలిశెట్టి



సభ్యత్వ నమోదు చేస్తున్న బండారు



వలందర్ రేవు పరిశీలిస్తున్న నాయకర్



విలేకరులతో మాట్లాడుతున్న అంజిబాబు

రైతుల సంక్షేమానికి పెద్దపీట

తాడేపల్లిగూడెం రూరల్/అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెదతాడేపల్లిలో జిల్లాలోనే ప్రప్రథమంగా మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్య తలెత్తినా సహించేది లేదన్నారు. ధాన్యం తూసిన 48 గంటల్లో సొమ్ములు అందిస్తామన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా తనకు తెలపాలన్నారు. ధాన్యం లోడులకు జెండా ఊపి కొనుగోళ్లు ప్రారంబించారు. ఆర్డీవో కేసర్ భానో, సర్పంచ్ అన్నవరం, టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సహకార సంఘాల అధికారులు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు చోట్ల నిర్వహించిన అన్న సమారాధనల్లో బొలిశెట్టి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎర్ర నారాయణస్వామి పాఠశాల వద్ద పట్టణంలోని రెండు, మూడు వార్డు ప్రజలకు మంచినీటి కోసం ప్యూరిఫైడ్ ట్యాంకులను ప్రారంభించారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: బండారు

మొగల్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ టీడీపీ అని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తెలిపారు. మొగల్తూరు లాకు వద్ద బస్వాని ఏడుకొండలు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కుమ్మరపురుగు తాతాజీ, కొండేటి శ్రీను, కర్రి వీరాస్వామి, కూనపరెడ్డి గోవిందరాజు, బందన నాగార్జున, డీఎస్, పెదసింగ్ భాస్కర రావు, వినుకొండ కాశీ, పులపర్తి నానాజీ, వాటాల వీరాస్వామి, లక్ష్మణస్వామి, వెలిది పుల్లారావు, లక్కు శేషు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మోడి, వారతిప్ప గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేశారు.

నరసాపురం టౌన్: ప్రజలు, కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయినా ఉచిత గ్యాస్ హామీ అమలు చేసిందన్నారు.

రేవుల్లో ఇబ్బంది రానివ్వద్దు: నాయకర్

నరసాపురం: కార్తీక మాసంలో గోదావరి స్నానాలకు విచ్చేసే భక్తులకు రేవుల్లో ఇబ్బందులు తలెత్తకూడదని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వలందర్, అమరేశ్వర రేవులు పరిశీలించారు. వలందర్ రేవులో షవర్ బాత్, పిండాల రేవును తక్షణం మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ అంజయ్య తదితరులు ఉన్నారు.

విరాళాల సొమ్ము అందజేస్తా: అంజిబాబు

భీమవరం టౌన్: విజయవాడ వరద బాధితుల కోసం భీమవరం నియోజకవర్గం నుంచి రూ. 97,52,780 విరాళాలు అందాయని, త్వరలో సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తానని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ భీమవరం నియోజక వర్గం నుంచి విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భీమవరం -లోసరి, భీమవరం - పిప్పర రహదారుల అభి వృద్ధికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సుమారు రూ.100 కోట్లు మంజూరు చేశారన్నారు. వచ్చే నెల 6న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు

ఆమోదించిన పనులకు టెండర్లు పిలవరా?

» కౌన్సిల్‌లో తీర్మానాలెందుకు » వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



ఆందోళన చేస్తున్న కౌన్సిలర్ గంగరాజు(ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్

నరసాపురం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ తీర్మానాలు చేస్తుంటే అధికారులు వాటికి ఎందుకు టెండర్లు పిలవడం లేదని వీసీ కొత్తపల్లి నాని, కౌన్సిలర్ గంగరాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వీరు మాట్లాడుతూ కార్తీకమాసంలో వేలాది మంది రేవుల్లో పుణ్యస్నానాలు చేస్తారు, ఇంత వరకు ఎందుకు శుభ్రం చేయలేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ అంజయ్య పనులు చేపడుతున్నామ న్నారు. అన్నక్యాంటీన్ ప్రారంభం సమయంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లను అవమానించిన ఘటన పై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ వైసీపీ కౌన్సిలర్లు వీసీ నాగిని, బొంతు రాజశేఖర్, అడిదెల శ్యామల, సీర్రా కాంతమ్మలు నిలదీశారు. దీనికి స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్, జనసేన కౌన్సిలర్లు సూర్యకుమారి, అరుణ వాగ్వాదానికి దిగారు. దీంతో సభలో గంధరగోళం నెలకొంది. దీంతో కోఆప్షన్ సభ్యులు వైకెఎస్ కల్పించుకుని పట్టణాభివృద్ధిపైనే చర్చ సాగాలని, అనవసర విషయాలపై చర్చ సాగించి సభ సమయాన్ని వృథా చేయరాదని కోరారు. గత సమావేశానికి వాయిదా వేశారు. మళ్లీ అప్పటి అంశాలను తిరిగి అజెండాలోకి ఎందుకు తీసు కొచ్చారని వన్నెంరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. పట్టణంలో మంచినీటి చెరువు ఏర్పాటు చేసిన మాజీ మునిసిపల్ చైర్మన్ చెరుకూరి లక్ష్మణరావు కాంస్య విగ్రహం ఏర్పాటుపై ఇంత వరకు ఎందుకు పనులు చేపట్టాలని కావలి రామసీత ప్రశ్నించారు. పార్కు రోడ్డులో వాటర్ ట్యాంక్ పడిపోయ్యేలా ఉందని, కనీసం కమిషనర్ పరిశీలించడం లేదని సఖినేటిపల్లి సురేష్ మండిపడ్డారు. మేనేజర్ నిర్మలకుమారి, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ నవ్య, దుర్గాకిషోర్, ఆర్ఐ నానాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్నెట్ డే సదస్సు

భీమవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్ ద్వారా దేశం ఎంతో అభివృద్ధి చెందిందని భీమవరం తహసీల్దార్ రాంబాబు అన్నారు. వరల్డ్ ఇంటర్నెట్ డే సందర్భంగా విజ్ఞాన వేదిక అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. మన దైనందిన జీవితంలో ఇంటర్‌నెట్ ప్రధానంగా మారిందన్నారు. ఇంటర్నెట్ రంగాన్ని సత్కార్యాలకే వినియోగించాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి నడుం బిగించాలి

భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ముందుగా మునిసిపల్ ఉద్యోగులంతా వస్తువుల వాడకం క్రమంగా తగ్గించే చర్యలు మొదలు పెడదామని మునిసిపల్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ కోరారు. జనపనార, లేదా గుడ్డ సంచులు వాడదామని, ప్రజలకు అవగాహన కల్పిద్దామని సూచించారు.

బీసీ కుల గణన చేయాలి

మొగల్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణన జరగాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వర రావు కోరారు. మంగళవారం మొగల్తూరులో నిర్వహించిన బీసీ ప్రజా సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం బీసీ రక్షణ చట్టం తీసుకువస్తానన్న హామీతో పాటు ఎస్సీ బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

ఆకివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని పట్టణ అధ్యక్ష, కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా అన్నారు. స్థానిక సాయినగర్‌లో సీసీ రోడ్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్తీక మాసంలో కాలువలో స్నానాలు చేసే ందుకు రేవు కట్టించాలంటూ మహిళలు వారిని కోరారు.



అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

భీమవరం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. అదనపు ఎస్పీ వి భీమారావు, డిఎస్పీ జయసూర్య, సిఐలు, ఎస్‌ఐలు, ప్రత్యేక బలగాలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వద్దు

భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం శివాలయానికి వచ్చే ప్రతి సామాన్య భక్తునికి శివుని దర్శనం కలిగించాలని, కార్తీక మాసంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అంజిబాబు సంబంధిత దేవాలయ అధికారులకు, పోలీసు అధికారులకు సూచించారు. పంచారామ క్షేత్రమైన భీమవరం శ్రీఉమా సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలో కార్తీక మాసం ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 1 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు కార్తీకామాస మహోత్సవాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనం క్యూ లైను, రూ.50, రూ. 100, రూ. 200ల ప్రత్యేక 4 క్యూ లైను, ఏర్పాటు చేశామని ఆలయ ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. ఆర్డీవో ప్రవీణ్, తహసీల్దార్ రవి రాంబాబు, వన్ టౌన్ సిఐ నాగరాజు, ఎస్సై కృష్ణాజీ, ఫైర్ ఆఫీసర్ సూర్య ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దన త్రయోదశి పూజలు

భీమవరంటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శ్రీమహాలక్ష్మి ధన ధాన్య, దన్వంతరీ పూజలను నిర్వహించారు. సామూహిక పూజలో దాదాపు 400 మంది భక్తులు పాల్గొని పూజలు చేసుకున్నారు.

వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరంటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : జువ్వపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి హుండీలను మంగళవారంనాడు లెక్కించగా 216 రోజులకు గాను 8లక్షల 55వేల 494 రూపాయిలు ఆదాయంగా వచ్చిందని దేవస్థానం ఇవో ఎం సత్యనారాయణరాజు తెలిపారు. నగదుతోపాటుగా 32 గ్రామల 600 మిల్లీ బంగారం, 502 గ్రాముల వెండి వచ్చాయనితెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ ధర్మదాయశాఖ ఇనస్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వర రావు, వంశపార్యంపర ధర్మకర్త మంతెన రామ్‌కుమార్‌రాజు, ఇవో దండు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారని చెప్పారు.

ఆరోగ్య సమస్యను ముందుగా గుర్తించాలి



భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలు ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమని డాక్టర్ విక్రాంత్ అన్నారు. భీమవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ మిత్ర మెడికేర్ డాక్టర్ చుండూరు విక్రాంత్ రాయితీపై వైద్య పరీక్షలు చేయించారు. రూ. 10 వేలు వరకు ఉండే లివర్ ఫిబ్రో స్కాన్ టెస్ట్ కేవలం రూ. 500కే సుమారు 200 మంది పేషెంట్స్ కి చేయించారు. ఈ సందర్భంగా భీమవరం లయిన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ చుండూరు విక్రాంత్ గారిని సత్కరించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి గోపిశెట్టి మురళి కృష్ణారావు, కోశాధికారి కుమార్, డైరెక్టర్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





భీమవరం, ఉండిలో వైద్యులకు సత్కారం

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి మహర్షి మనకు ఎన్నో ఔషధాలను అందించారని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు మల్లేశ్వరి అన్నారు. ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రవి కుమార్‌ను సత్కరించారు. అనంతరం రాహుల్ వృద్ధాశ్ర మంలో, సూర్య తేజస్ నగర్‌లో వృద్ధులకు ఆయు ర్వేదంపై అవగాహన కలిగించారు. జున్నూరు పెదపేట ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

చేతివృత్తులవారిని ఆదుకోవాలి

భీమవరం టౌన్: చేతివృత్తుల వారికి ప్రభుత్వం అండగా నిలవాలని జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు కోరారు. దన్వంతరి జయంతి ఉత్సవాలు భీమవరం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, మంగళ వాయిద్య కళాకారుల సంఘం, నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెంటే వారి తోటలో గల నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త పిప్పళ్ళ ప్రసాదరావు ధన్వంతరి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించా రు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుడు గోరంట్ల మహేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. భీమవరం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎం. రఘుబాబు, మంగళ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు తాడి మావుళ్ళు, వేపాడ పెద్దిరాజు, మల్లువలస మావుళ్లు ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఉండి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ముత్యాలపల్లి రాంబాబు దంపతులు ధన్వంతరి మహర్షి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టరు బండి బాల శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. గౌరవాధ్యక్షుడు సన్యాసిరావు, అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి హరీష్, కోశాధికారి సత్యనారాయణ, సంఘం జిల్లా నాయకుడు అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వివేకానందలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

తణుకు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. కెప్టెన్ ఉప్పు లక్ష్మీ సుందరీబాయి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. స్కూలు కార్యదర్శి చిట్టూరి రీనా సాయి, అధ్యక్షుడు కేవీ సుబ్బారావు,ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, కోశాధికారి నందిగం సుదాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావ, స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌లు గొట్టుముక్కల నిఖేష్ వర్మ, ముదునూరి వర్షిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వేపై 157 ఫిర్యాదులు

కాళ్ళ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించి గత ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వే తప్పిదాలు సరిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ రీసర్వే గ్రామ సభలు కాళ్ళ మండలంలో ముగిశాయని తహసీల్దార్ సుందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. కాళ్ళ మండలం సీసలి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ రీసర్వేలో అభ్యంతరాలను స్వీకరించారు. మండలం మొత్తం 157 పిర్యాదులందాయన్నారు.

ఉండి: భూముల రీసర్వేలన్నీ తప్పుల తడకగా వున్నాయని వాటిని రద్దుచేసి పాత వెబ్‌ల్యాండ్ ప్రకారమే కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం యండగండిలోని గ్రామసచివాలయం వద్ద భూములకు సంబంధించి రీసర్వే గ్రామసభలో యండగండి వినియోగదారుల సంఘం ప్రదాన కార్యదర్శి గోపాకృష్ణంరాజు, కొండపల్లి తవిటయ్య, తాడికొండ సూర్యచంద్రరావులు మాట్లాడుతూ తమ భూములు రీసర్వే వల్ల తగ్గాయని, తక్షణం సరిచేయాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్డీవో తనిఖీలు

నరసాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో దాసిరాజు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించారు. రోగుల సంఖ్య, ఆసుపత్రిలో మందుల పరిస్థితిని సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని మందులు కొరత ఉంటే జిల్లా వైద్యా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ రాజేశ్వరి ఉన్నారు.

బాణాసంచా దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాణా సంచా వ్యాపారం చేసే వారు భద్రతా విషయంలో అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బాణ సంచా దుకాణ సముదాయాన్ని ఆయన ఫైర్ ఆఫీసర్ రామారావుతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ బ్లాక్‌చైన్ నెట్‌వర్క్ సెంటర్ ప్రారంభం

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ నిపుణుల కొరత ఎక్కువగా ఉందని ప్రముఖ ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ అధికారి ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భారత్ బ్లాక్‌చైన్ నెటవర్క్ సెంటర్‌ను సీనియర్ ప్రొఫెసర్ కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రారంభించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

భీమవరం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ఎక్సైజ్ సిఐ కె బలరామరాజు హెచ్చరించారు. అలాగే మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీల కంటే ఎక్కువ ధరలు అమ్మినా చర్యలు తీసుకొంటామని తెలియజేశారు. ఎక్కడైనా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే 9440902439కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యాసామగ్రి వితరణ

కాళ్ళ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని కలవపూడి సిబిసిఎంసి పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కలవపూడి గ్రామంలో తపాల శాఖలో విధులు నిర్వహిస్తున్న పోస్టుమాన్ సోడదాసి యాకోబు ఆర్థిక సాయంతో సుమారు 20 మంది విద్యార్థులకు, పెన్నులు, నోట్‌బుక్స్‌తో పాటు విద్యాసామాగ్రిని అందించారు.